క్లుప్తంగా

సంరక్షణ గృహానికి బాలుడి అప్పగింత


వంతల లోకేష్

పీఎం పాలెం: తల్లిదండ్రులను కోల్పోయి, రోడ్డుపై సంచరిస్తున్న బాలుడిని పోలీసులు చేరదీసి, సంరక్షణ గృహానికి అప్పగించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఓ బాలుడు (11) ఎండాడ కూడలి ప్రాంతంలో కొద్ది రోజులుగా తిరుగుతుండటం గుర్తించిన స్థానికులు పీఎం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని విచారించగా తన పేరు వంతల లోకేష్ అని, తల్లిదండ్రులు రంజిత్, సుభాషిత తన చిన్నప్పుడే మరణించారని తెలిపాడు. సింహాచలం, ఆరిలోవ ప్రాంతాల్లో తన బంధువులున్నారని, వారికోసం వెదుకుతున్నానని తెలియజేశాడు. అంతకు మించి వివరాలు చెప్పలేక పోయాడు. దీంతో ఆ బాలుని బాలుర సంరక్షణ గృహానికి అప్పగించారు. బాలుడి గురించి తెలిసినవారు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

‘వేధింపుల ఏవోపై చర్యలు తీసుకోవాలి’



మాట్లాడుతున్న భాగం గోపాలరావు

భీమునిపట్నం: దళిత మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న శిల్పారామం పరిపాలన అధికారి (ఏవో) విశ్వనాధరెడ్డిపై అధికారులు చర్యలను తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు డిమాండ్ చేశారు. భీమిలి ప్రెస్ క్లబ్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏవో వద్ద జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దళిత మహిళపై అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో, ఆమె మానసిక వేదనకు గురవుతోందన్నారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పద్మశ్రీ అనే మహిళ, బాధిత మహిళపై కుల వివక్ష చూపుతూ అవమానిస్తోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి, విచారణ చేసి వీరిపై తగిన చర్యలను తీసుకోవాలని కోరారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన


విద్యార్థితో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శేషమ్మ

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొని న్యాయ సంబంధమైన పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలను,ఇక్కడ వసతి గృహాన్ని సందర్శించి కాసేపు విద్యార్థినులతో ముచ్చటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.కె.నూర్జహాన్,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లో వ్యక్తి మృతి

మధురవాడ: స్వతంత్రనగర్ పార్కులో ఉన్న పాకలు కాలనీ వద్ద సులభ్ కాంప్లెక్స్‌లో వాకాడ రమణ(60) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రమణ కుటుంబం కొద్ది సంవత్సరాలుగా పార్కులో ఉన్న కాలనీలో నివాసం ఉంటోంది. రమణ లారీ లేబర్ కాగా, భార్య పార్వతి దినసరి కూలి, కుమార్తె వివాహిత. రాజాం సమీపం పెరుమళ్లకు చెందిన వీరు బతుకుతెరువు నిమిత్తం మధురవాడ వచ్చేశారు. గురువారం ఉదయం 4గంటలకే రమణ ఇంటి నుంచి బయటకు వచ్చేయగా, భార్య పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. సుమారు 7గంటల ప్రాంతంలో అక్కడున్న సులభ్ కాంప్లెక్స్ వద్ద రమణ పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గుండెపోటు కారణంగా మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

నీరు పోయే మార్గమేది?

- హైవే డ్రైనేజీల్లో పూడికలు
- నీట మునుగుతున్న సర్వీస్ రోడ్లు
- వాహనచోదకుల అవస్థలు


మహరాజుపేట నుంచి డ్రైనేజీపై నిర్మించిన శ్లాబు


సబ్బవానిపేట వద్ద హైవే డ్రైనేజీలోకి చేరని నీరు


వర్షం కారణంగా మునిగిన సంగివలస సర్వీస్ రోడ్డు


సంగివలస అండర్‌పాస్ వద్ద పూడిక కారణంగా ప్రవాహం లేని డ్రైనేజీ


వెంకటేశ్వరమెట్ట వద్ద సర్వీస్ రోడ్డుపై వర్షపునీరు

తగరపువలస: చిన్న వర్షం కురిసినా జాతీయ రహదారుల వెంట ఇరువైపులా సర్వీస్‌రోడ్లు నీట మునిగిపోతున్నాయి. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస నుంచి భీమిలి మండలం మహరాజుపేట కూడలి వరకు ఇదే పరిస్థితి. రహదారులపై నీరు నిలిచిపోయిన ప్రతీసారి జీవీఎంసీ, ఇరిగేషన్, హైవే అధికారుల హడావుడి తప్ప శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. గతంలో పలు మార్లు ఇదే పరిస్థితి ఏర్పడినప్పుడు కలెక్టర్లు, జీవీఎంసీ కమిషనర్లు ఈ ప్రాంతాలను పరిశీలించారు. శాశ్వత పరిష్కారం చూపుతామని, ఈ ప్రాంతంలో చెరువులు, గెడ్డలకు సంబంధించిన రికార్డులు తీసుకురావాలని, వివిధ విభాగాల అధికారులకు చేసిన సూచనలు అలాగే మిగిలిపోయాయి. రహదారులపై నీరు నిలిచిపోవడానికి పూడికతో నిండిపోయిన డ్రైనేజీలే కారణమని గుర్తించలేకపోతున్నారు.

ఫ్లైయాష్ పూడికలు తొలగించకుండానే..

హైవే విస్తరణ సమయంలో వినియోగించిన ఫ్లైయాష్ నిర్మాణ సమయంలో వర్షాలకు కరిగి డ్రైనేజీలు నిండిపోయాయి. ఫ్లైయాష్‌తో నిండిపోయిన పూడికను తొలగించకుండానే డ్రైనేజీలపై సిమెంట్ పలకలు కాకుండా నేరుగా శ్లాబు వేయడంతో అప్పటి నుంచి వర్షాల ద్వారా కురిసిన నీరు డ్రైనేజీలలో కాకుండా రహదారులపై నిలిచిపోతోంది. ఈ సమస్య ఎక్కువగా సంగివలస, సబ్బవానిపేట, ఆదర్శనగర్, వెంకటేశ్వరమెట్ట, మహరాజుపేట, అవంతి కళాశాల, టి.నగరపాలెం ప్రాంతాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా సంగివలస వద్ద బయట ప్రాంతాల నుంచి నీరు చెరువులోకి వెళ్లకుండా పార్కు గట్టు ఎత్తు పెంచిన కారణంగానే ముగ్గురు అమ్మవార్ల ఆలయం నుంచి సంగివలస కాలనీ, విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు సర్వీస్‌రోడ్డు చెరువులా మారిపోతుంది. సబ్బవానిపేట, ఆదర్శనగర్‌లోని టీచర్స్ కాలనీలలోని రాకపోకలు కూడా నిలిచిపోతుంటాయి.

పంచాయతీలకు ముంపు ముప్పు

భీమిలి మండలంలో జాతీయరహదారిపై సర్వీస్‌రోడ్డును ఆనుకుని టి.నగరపాలెం నుంచి తాటితూరు పంచాయతీ వరకు ఉన్న డ్రైనేజీలు కూడా పూడికతో నిండిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో చిన్నపాటి వర్షానికే ఇరువైపులా సర్వీస్‌రోడ్డుపై రెండు నుంచి మూడు అడుగుల మేరకు నీరు నిలిచిపోయి మహరాజుపేట కూడలి వరకు చెరువుగా మారిపోతుంది. డ్రైనేజీకి మించి చేరిన వర్షంనీరు తరువాత జాతీయ రహదారిపైకి చేరుతుండటంతో తరచూ ఈ ప్రాంతంలో వర్షాలు కురిసినప్పుడు వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఇక్కడి డ్రైనేజీలు పనిచేయడం మానేశాయి.

అవుట్‌లెట్లు లేక..

సర్వీస్‌రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు, కల్యాణమండపాలు, కార్లు, ద్విచక్రవాహనాల షోరూమ్‌లకు అవుట్‌లెట్లు లేని కారణంగా వీటి నుంచి వచ్చిన వ్యర్థాలను డ్రైనేజీలలోకి మళ్లిస్తున్నారు. అధిక వర్షాల సమయంలో నూనెలు, మసాలాలతో కూడిన వ్యర్థాలు డ్రై నేజీల నుంచి తన్నుకురావడంతో సర్వీస్‌రోడ్డులో వాహనదారులు జారిపడిపోతున్నారు. ఈ సమస్య ఇటీవల ఎక్కువ కావడంతో జాతీయరహదారుల సిబ్బంది జేసీబీలు తీసుకువచ్చి డ్రైనేజీల క్లీన్ చేస్తామని చెప్పి, కేవలం డ్రైనేజీలను ఆనుకుని తుప్పలను తొలగించి వెళ్లిపోయారు. డ్రైనేజీలో పూడిక అలాగే ఉండిపోవడంతో నగరపాలెం, తాటితూరు పంచాయతీ వాసులు వర్షం వస్తే ఆందోళన చెందుతున్నారు. తుపానులు, అల్పపీడనాల కారణంగా మళ్లీ వర్షాలు కురిస్తే సమస్య తప్పదని అంటున్నారు. ఈ డ్రైనేజీలు పూడికతో నిండిపోయినందున ఈ రెండు పంచాయతీలకు చెందిన గ్రామాలలో వర్షంనీరు రోజుల తరబడి నిలిచిపోతోందని, ఇప్పటికైనా డ్రైనేజీల పూడిక తొలగించాలని కోరుతున్నారు.

చెరువే మొదటి సమస్య



సంగివలస చెరువే మొదటి సమస్య. ఈ చెరువు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలను ఆధునీకరించి నీరు సాఫీగా వెళ్లేందుకు జీవీఎంసీ, ఇరిగేషన్ పని చేస్తే సగం సమస్య పరిష్కారమవుతుంది.

– పందిరి విజయ్, తగరపువలస

డ్రైనేజీలు సరిచేయాలి



గోస్తనినది దాటిన తరువాత టి.నగరపాలెం నుంచి మహరాజుపేట కూడలి వరకు ఇరువైపులా డ్రైనేజీలను సరిచేయాలి. గ్రామ పంచాయతీల నుంచి గెడ్డల ద్వారా వచ్చే నీరు డ్రైనేజీల ద్వారా ప్రవహించేలా చేయాలి. వ్యాపార సంస్థలు అవుట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలి.

– తుపాకుల అప్పలస్వామి, మజ్జివలస

పూడిక పూర్తిగా తొలగించాలి



డ్రైనేజీలు మొత్తం పూడికతో నిండిపోయాయి. అందు వలన వర్షంనీరు డ్రైనేజీలలోకి చేరలేకపోతుంది. రోడ్లపై కురిసిన వర్షం డ్రైనేజీల గుండా పోతే వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది. వాహనదారుల అవస్థలు తప్పుతాయి.

– గుజ్జు వెంకట పైడి సూరిబాబు,చిట్టివలస

ఉపాధి హామీ పనులకు శంకుస్థాపన

తగరపువలస: మండలంలోని దాకమర్రి పంచాయతీ ముద్దాడపేట, అమనాం పంచాయతీలలో రూ.77 లక్షలతో చేపట్టనున్న ఉపాధి హామీ పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన ఈ రెండు పంచాయతీలలో సీసీ రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ చెల్లూరి పైడప్పడు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో సిమెంట్ రోడ్లకు..

పద్మనాభం: మండలంలోని మద్దిలో ఉపాధి హామి పథకం నిధులు రూ.15లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ బుగత సన్యాసమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు బుగత శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు కె.నగేష్ కుమార్ పాల్గొన్నారు.

శిక్షణతో పంచాయతీ పాలన మెరుగు


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

పద్మనాభం: గ్రామ పంచాయతీ పరిపాలనను మెరుగుపరచుకోవడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మంచి పాలన అందించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. టీవోటీలుగా సి.హెచ్.ప్రసాదరావు, వి.ఎస్.బ్రహ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి పాల్గొన్నారు.

స్కావెంజర్లకే చేతి చమురు

- పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ నిలిపివేత
- కూటమి ప్రభుత్వ పాలనలో గోడు వినేదెవరు?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలకు సరఫరా చేసిన క్లీనింగ్ మెటీరియల్


తగరపువలస: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల స్కావెంజర్లకు చేతి చమురు వదులుతోంది. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరచింది మొదలు టాయిలెట్ల క్లీనింగ్ మెటీరియల్ ఇవ్వకపోవడంతో ప్రాథమిక పాఠశాలల్లో స్కావెంజర్లు నెలకు రూ.1000 నుంచి రూ.2వేలు సొంతంగా పెట్టుబడి పెట్టవలసి వస్తోంది. హైస్కూళ్లలో అయితే వీరికి వచ్చే రూ.6వేల మొత్తం మెటీరియల్‌కే ఖర్చు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్కావెంజర్లకు నెలకు రూ.6వేలు వేతనం చెల్లిస్తూ, ఏడాదికి సరిపడా క్లీనింగ్ మెటీరియల్ ఇచ్చేవారు. అందులో పెద్ద బక్కెట్-1, చిన్న బక్కెట్లు-2, గ్లౌజులు-2 జతలు, కేన్-1, స్ప్రేయర్లు-2, మగ్-1, 5 లీటర్లు వంతున ఫ్లోర్ క్లీనర్, టాయిలెట్ క్లీనర్లు , ఫ్లోర్ క్లీనింగ్ కర్రలు ఇచ్చేవారు. రోజుకు నాలుగు సార్లు క్లీనింగ్ కోసం స్కావెంజర్లు వీటిని వినియోగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెటీరియల్ ఇవ్వకపోయినా, స్కావెంజర్లు తమ చేతి నుంచి ఈ మెటీరియల్ కొనుగోలు కోసం రూ.వేల్లలో ఖర్చు చేస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలో సుమారు 280 స్కూళ్లలో స్కావెంజర్లు తమ ఆవేదనను ఉపాధ్యాయుల వద్ద వెళ్లబోసుకుంటున్నా దున్నపోతుమీద వర్షం పడ్డట్టుగా ఉంది ప్రభుత్వ తీరు.

‘గీత’లో ధర్మాలు ఆచరణీయం


భగవద్గీత ప్రచార కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస: భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు బోధించిన ధర్మాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి, విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు కోరారు. పౌర్ణమి సందర్భంగా తగరపువలస, భీమిలిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. త్రినాథరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏ మతమూ లేని నాడే భగవద్గీత జ్ఞానం తెలియజేశారన్నారు. రానురాను భగవద్గీత జ్ఞానాన్ని మరచిపోవడం వల్లనే అధర్మాలు పెరిగిపోతున్నాయన్నారు. సనాతన ధర్మాన్ని ఆచరణ ద్వారా పునరుద్ధరించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వి.సురేష్, బి.పైడన్న, జి.కృష్ణసూరప్పడు, ఎస్.శ్రీనివాస్, కె.రాజు, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి రామాయణం మానవజాతికి వరం


వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డా.రాణి తదితరులు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం ప్రసాద్

తగరపువలస: వాల్మీకి రామాయణం మానవజాతికి వరమని ఆనందపురం మండలం గంభీరం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి.ప్రసాద్ అన్నారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు ఆయన గురించి వివరించారు. రత్నాకరుడనే బోయవాడు భగవత్ సంకల్పంతో తపస్సు చేసి వాల్మీకిగా మారాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాల్మీకి మహర్షిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహర్షికి నివాళి

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ భవన్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మంద వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: వాల్మీకి మహర్షి జయంతిని బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో గురువారం నిర్వహించారు. 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రామాయణం ద్వారా మహోన్నత విలువలను జగతికి అందించిన మహనీయుడు వాల్మీకి అని కీర్తించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెంట్ జి.ఇలాయసాగర్, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వదలని వాన

- రోడ్లు, డ్రైనేజీలు ఏకమై ప్రవహిస్తున్న నీరు
- వాహనచోదకులు, పాదచారుల అవస్థలు


చంద్రంపాలెం వద్ద చెరువును తలపిస్తున్న హైవే సర్వీసు రోడ్డు


నీట మునిగిన వరాహగిరి నగర్


మధురవాడ పీఏసీఎస్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, వర్షం నీరు


కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..

కొమ్మాది: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తీర ప్రాంతంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో 8వ వార్డు ఎండాడ దరి వరాహగిరి నగర్ నీట మునిగింది. కాలనీలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల నివాసాల్లోకి నీరు చొచ్చుకుని వచ్చింది. రుషికొండ ఐటీ జంక్షన్, ఇస్కాన్ ప్రధాన రహదారి, గుడ్లవానిపాలెం జంక్షన్, రామాద్రి ప్రధాన రహదారి వద్ద వరద నీరు రోడ్డు మీదే నిలిచిపోయింది. 4వ వార్డు కాపులుప్పాడ దరి పరదేశిపాలెం గెడ్డ భారీ ఎత్తున పొంగి పొర్లడంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో తీర ప్రాంత మత్స్యకారులు వేటకు విరామం ఇచ్చారు. ఉప్పాడ, మంగమారిపేట, ఐటీ జంక్షన్ సమీపంలో సముద్రం ముందుకు చొచ్చుకుని వచ్చింది. రుషికొండ బీచ్‌లో వాయుగుండం నేపథ్యంలో బోటు షికారు నిలిపి వేశారు. సముద్ర కెరటాలు ఎగిసి పడటంతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

పీఎం పాలెం: వర్షం కారణంగా హౌసింగ్ బోర్డు కాలనీ, బాబానగర్, గాయత్రీనగర్, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. అంతర రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు కష్టమయ్యాయి.

జడివానతో అవస్థలు

మధురవాడ: జడివానతో జనం అవస్థలు పడుతున్నారు. మ్యాన్ హోల్స్ నిర్వహణ అధ్వానంగా ఉండడంతో కొమ్మాది నుంచి క్రికెట్ స్టేడియం వరకు రెండు వైపులా రోడ్లు, కాల్వలు ఏకమై రాకపోకలకు అంతా ఇబ్బంది పడ్డారు. మధురవాడ అప్ బ్రిడ్జి, మధురవాడ నుంచి ఉడా కాలనీ రోడ్డు వరకు సర్వీసు రోడ్డుపై మరింత నీరు నిల్వ ఉండిపోయినంది. రేవళ్లపాలెం రోడ్డు పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

రెండు ఆలయాల్లో హుండీ నగదు చోరీ


పెంట శివాలయంలో దొంగలు విరగ్గొట్టిన హుండీ

పద్మనాభం: మండలంలో రెండు ఆలయాల్లో హుండీలను దొంగలు విరగ్గొట్టి నగదు అపహరించారు. పెంట శివాలయంలోని హుండీని విరగ్గొట్టి నగదు తస్కరించారు. కొత్త కొవ్వాడ పైడితలమ్మ ఆలయంలోని హుండీని స్థానిక పాఠశాల వద్దకు తీసువెళ్లి విరగ్గొట్టి నగదు అపహరించారు. ఈ చోరీకి సంబంధించి కొత్త కొవ్వాడకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కొత్తకొవ్వాడలో అభయాంజనేయ స్వామి ఆలయం, పైడితల్లమ్మ ఆలయంలో గతంలో చోరీలు జరిగాయని గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు


రామకొండ ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణం

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీ జి.ఎస్.అగ్రహారం సర్వే నంబర్ 121లోని ‘పోరంబోకు రామకొండ’పై ఆక్రమణదారులు తెగించారు. గతంలో ఈ కొండపై అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పుడు పలువురు తహసీల్దార్లు వాటిని కూల్చివేసి, హెచ్చరికల బోర్డులు కూడా పెట్టారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల పాలవుతున్నట్టు స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, హెచ్చరికల బోర్డులు తీసి పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కూటమి ప్రభుత్వ నాయకుల చెప్పుచేతల్లో ఉన్న సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తున్నా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. రామకొండ వద్ద అక్రమ నిర్మాణాలపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయనున్నట్టు రామవరం పంచాయతీ వాసులు తెలిపారు. ఆక్రమణదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు.

దోమల మందు తాగి పారిశుధ్య కార్మికుడి మృతి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా విధులు నిర్వర్తిస్తున్న గోక గురు ఈశ్వరరావు దోమల మందు తాగి బుధవారం రాత్రి మరణించాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిస అయిన ఈశ్వరరావును భార్య రమాదేవి మందలించడంతో దోమల మందు తాగి, వాంతులు చేసుకున్నాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో, చికిత్స కోసం కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈశ్వరరావు పంచాయతీలో దోమల నివారణకు వినియోగించే మందుతోనే ప్రాణం తీసుకున్నాడు. వీరికి 13 ఏళ్ల కుమార్తె గాయత్రి, 9 ఏళ్ల కుమారుడు తరుణ్ ఉన్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ ఎన్.గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెస్సీలో స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో చేరడానికి అవకాశం కల్పిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. విష్ణుమూర్తి తెలిపారు. ఇందులో 25 సీట్లు ఇంకా మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. కోర్సులో చేరడానికి ఆసక్తి, అర్హత ఉన్నవారు 21వ తేదీ సాయంత్రంలోపు వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలియజేశారు.